# శతక రామాయణం



**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech



## ముందుమాట

రామాయణం అందరిలా కాక, ప్రధమ పురుష (First Person) లో వ్రాయాలని నాకోర్కె.

దీనిగురించే ఆలోచిస్తూంటే నా మెదడులో మెరిసింది "షణ్ముఖ రామాయణం" ఈ రామాయణం ఆరుగురి నోటినుండి వెలువడుతుంది. (షణ్ముఖ రామాయణం) ఆరుగురూ ప్రధమపురుషలో అంటే ఉదా: లక్ష్మణుడు చెప్పేటప్పుడు, "అన్న రామయ్య మధ్య లోనూ, వదిన సీతమ్మ మునుముందు నడుస్తుంటే నేను వెనుకవుండి నడిచాను" అని వుంటుంది. ఇలాగే రాముడు బాలకాండము, లక్ష్మణుడు అయోధ్య కాండము, సీత అరణ్యకాండము, సుగ్రీవుడు కిష్కింద కాండము, హనుమంతుడు సుందరకాండము, విభీషణుడు యుద్ధకాండము చెప్తారు.



ఇదివరకు తెలుగు నవలల్లో ఈ ప్రక్రియ చేసినవారు పాఠకులకు చెప్పినట్లు వ్రాశారు. అది చాలా కృతకంగా (Un Natural) వుంటుంది. నేను ఇట్లా కాకుండా ఆరుగురూ ఎవరో ఇంకొకరికి చెబుతున్నట్లు వ్రాస్తే మంచిది అనుకున్నాను. ఎవరికి చెప్పాలి? భరతునికి లేదా అంగదునికి.

నేను అంగదుణ్ణి (అందరికంటే చిన్నవాడు. పైగా యువరాజు. రామాయణం నేర్వవలసినవాడు) ఈ ఆరుగురికీ శ్రోతగా ఎన్నుకున్నాను. అయితే సీతాదేవి కూడా తన కథ అరణ్యకాండము చెప్పుకోవలసిన అవసరం ఏముంది? ఆ రామయ్య అడిగితే గాని ఆవిడ చెప్పదు. ఆయన ఎందుకు అడుగుతాడు? రెండు రోజుల్లో దానికీ నాకు ఆలోచన తట్టింది. అదే పట్టాభిషేకం తర్వాత బహుమతి ప్రధానం. ఇక్కడ



నా కల్పన చిగురందించి రామచంద్రుడిచ్చిన బహుమతితో అంగదుడు సంతుష్టుడవలేదని స్వామి గ్రహించి తరచి తరచి అడుగుతాడు. అప్పుడు అతను రామకథని వినాలని వుందని అడుగుతాడు. అప్పుడు రాముడు పెద్ద సభలో తన కథ బాలకాండముతో మొదలు పెడతాడు.

ఇలా ఆరుగురి ముఖాలనుంచి వచ్చిన రామకథే 'షణ్ముఖ రామాయణం'. ఇలా షణ్ముఖ రామాయణం వ్రాద్దామన్న నా ఆశ అడియాస అయింది. 18-6-2002 నాడు నా కుడిచెయ్యి, కాలు పక్షవాతం పాలయ్యాయి. కానీ ఆ వెంకన్న దయవల్ల నానోటికేం కాలేదు. 90% క్లారిటీతో మాట్లాడగలిగాను. కాలు, చెయ్యి మూడు వంతులు బాగయ్యాయి. కానీ కుడిచేతి వ్రాత రాలేదు. ఎడం చేత్తో అభ్యాసం చేసి అర్థం

చేసుకునే విధంగా వ్రాయగలిగాను. కానీ ఒకేసారి ఒకపేజీకన్నా వ్రాయలేను. మళ్ళీ నా రచనా వ్యాసంగం మొదలు పెట్టాను. నా పాత రచనలన్నీ కంప్యూటర్ ప్రింట్ తీయించాను. ప్రస్తుతం శతకాలు వ్రాస్తూ ఆ భగవంతుణ్ణి ఆరాధిస్తున్నాను.

ఆ ప్రయత్నంలో భాగవే ఈ "శతక రామాయణం". ఇది ఆ శ్రీరాముడి చరిత్రే కానీ "షణ్ముఖ రామాయణం" కాదు కానీ శతక రూపంలో చెప్పిన రామకథ. పాప సంహారకమైన రామనామం మకుటంలో ఉండుటవలన పుణ్యమంతా దీని చదువరిదే.

నేను అనుకోకుండానే జరిగిన మంచి ఏమిటంటే శతకరూపంలో రామాయణగాధ విని పించడం సాధ్యమైంది. ఇటు శతకం వ్రాసిన అదృష్టం కలిగింది, అటు రామాయణం వ్రాసిన పుణ్యం దక్కింది.



రామాయణం నూట ఎనిమిది పద్యాల్లో వ్రాయడం ఏమిటని ఆశ్చర్యపోకండి. రామాయణం మూడే మాటల్లో (వాక్యాల్లో కాదు) చేప్పాడు ఒక ఘనుడు. కట్టె, కొట్టె, తెచ్చె. అంటే వారధి కట్టె, రావణుని కొట్టె, సీతను తెచ్చె. ఇదీ రామాయణమే. వాల్మీకి రామాయణం, తులసీదాసుగారి అవధిలోని రామా యణం, కంబన్‌గారి తమిళ రామాయణం అన్నీ ఒక్కటే కదా. అన్నింటికీ కట్టె కొట్టె తెచ్చె మూలమే. మరి ఈ "శతక రామాయణం" మాత్రం ఆ శ్రీరామచంద్రునికి ప్రీతి కలిగించదా? తప్పక కలిగిస్తుంది.

ఈ ఆదికావ్యాన్ని రచించింది ఒకబోయ (బ్రాహ్మణుడు కాదు). ఆయన భక్తి దారిలో పడింది. "మరా,మరా, మరా, మరా అని అదే పనిగా అంటూ.



క్రౌంచపక్షి మరణం ఆ బోయను కవిని చేసింది. అందుకని దారి మళ్ళాలంటే బాధ తప్పదు. మరి ఒకబోయ చెప్పిన ఈ పవిత్రకావ్యాన్ని చదవటానికి ఏజాతి, కుల, మత అడ్డుగోడలు లేవు. భక్తి ఉంటే చాలు. ఈ రామాయణం మనందరిది.

ఈ రామాయణం శ్రావ్యంగా పాడగలిగితే మీతోపాటు విన్నవారంతా తప్పక స్వామి దయ పొందుతారు.

మనసారా ఇలా అనండి



శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమేరామ మనోరమే
సహస్రనామ తత్ తుల్యం రామనామ వరాననే

ఈ శ్లోకం ఒకసారి చదివితే
వెయ్యి సార్లు రామా అన్నట్లే.

కాబట్టి సాధ్యమైనన్ని ఎక్కువసార్లు అని సాధ్యమైనంత పుణ్యం సంపాదించండి.

ఇక పాఠ్యంలోకి వద్దాం!

# ప్రార్థన

తే॥ శ్రీయు అలిగిన వేళల చిద్విలాస!
మంగ తోడుండె అలివేణి మాటలాడ
శిలవు అయితివి సవతుల చింతవల్ల
చింతమాకేల నీవుండ శ్రీనివాస

ఉ॥ ఏమి తపంబు చేసితినొ యేర్పడె శ్రేష్ఠత
విద్యలందు నే
నేమి వ్రతంబు పూనితినొ యెల్లరు మెచ్చిరి
మంచివాడనం
చేమి ధనంబు దానమును యిచ్చితి
నో 'సిరి' వెంటనుండె, కా
నేమపరాధమో బ్రతుకు హేయము
జేస్తివి రామభూవరా



కం॥ ఎక్కడ నుండొచ్చామో
ఎక్కడికటు పోదు మిద్ది యెరుగను వశమే
ఇక్కడ యున్నన్నాళ్ళూ
చక్కగ నీధ్యాసయుంచు చాలును స్వామీ

చం॥ వదలగబోను నీ పదము బాధలు
కొల్లలు యిచ్చినన్ ప్రభూ!
చెదరగబోదు నా మనసు శ్రీపతి
వ్రాసితి రామగాధ నే
నిది శతకంబు రూపమున నేర్పడ చెప్పెద
చేవనిమ్ము నే
కదలను కాలుడొచ్చినను కావుము
నీదయ రామభూవరా



## అంకితం



కం॥ రాముని కులదైవంబై
ఈ మహికాధారమైన ఇలవేల్పువయా
ఏమరక సూర్యదేవా
స్వామీ అంకితముగొనుము జగములు వెలుగన్!



# శతక రామాయణం

ఆ॥ సూర్యవంశమందు శోభించె నిక్ష్వాకు,
1 కీర్తిగనిన ఆ భగీరధుండు,
ఆడి తప్పనట్టి ఆ హరిశ్చంద్రుడు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ దశరధుండు నట్లె ధరనేలె కీర్తితో
2 ముగ్గురాయెయతని ముద్దుసతులు
సంతులేదు యన్న చింత బాధించెను
రామచరిత వినరె రక్తితోడ

తే॥ పుత్రకామేష్టి జేయగ బూనె రాజు,
3 పాయసంబును యిచ్చెను పావకుండు
దాని దిన్నట్టి రాణులు తల్లులైరి
రామచరితను వినిపింతు రమ్యముగను

ఆ॥ రాముడయ్యె బిడ్డ రాణి కౌసల్యకు,
4 భరతుడాయె కైక ప్రాణమా సు
మిత్ర బిడ్డలైరి శత్రుఘ్న, లక్ష్మణుల్
రామచరిత వినరె రమ్యముగను

ఆ॥ నలుగురన్నదమ్ము లలరించ రాజును
5 కంటివెలుగు యగుచు గనులు పండ
విద్యనేర్చిరంత వేత్త వశిష్ఠుచే
రామచరిత వినరె రక్తితోడ

తే॥ కైక ప్రాణమై రాముని సాకుచుండె
6 లక్ష్మణుని ప్రాణమన నొప్పె రాముడంత
భరత, శతృఘ్నులును యట్లె భక్తి మొక్కు
రామచరితను వినిపింతు రమ్యముగను



తే॥ కౌశికుని యాగరక్షకై కానలందు
7 చనుచు నేర్చిరి శస్త్రాస్త్ర సకలమున్ను
రామ లక్ష్మణుల్, తాటకన్ తాము జంప
రామచరితను వినిపింతు రమ్యముగను

తే॥ యాగరక్షకు జంపెను ఆ సుబాహు
8 కాని మారీచు నొదిలెను ప్రాణములతొ
ప్రభువు, మునివెంట మరలుచు పయనమయ్యె
రామచరితను వినిపింతు రమ్యముగను

తే॥ పాదముల తాకి రాతినే ముదితచేసి
9 పాపముక్తిని గావించి భర్తకిచ్చి
మిధిల జేరిరి జనకుని పిలుపునంది
రామచరితను వినిపింతు రమ్యముగను



ఆ॥ సీత మాలతోటి చేర స్వయంవర
10 మంటపంబు నృపుల మనసులూగె
ఆమె రామపత్ని అని వారెరుంగరు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ శివుని విల్లు విరిచి సీతను పెండ్లాడి
11 పరశురామ గర్వహరణచేసి
జనక రాజఋషికి జతలేని అల్లుడౌ
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రాజు చేయనెంచె రాముని ఏలిక
12 మంతనాలు జరిపె, మంత్రులనిరి
నచ్చి, జేయగ మరునాడు రామభిషిక్తు
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ మంధరనెడి దాసి మార్చి కైక మనస్సు
13 చెడును బోధజేసె జేరి కైక
రామగాధ నాడె రసకంధమయ్యెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ కైకకిచ్చె వరము కాపాడ పూర్వము
14 రాజు, నేడు కోరె రాము వనికి
పంప, రాజ్యమేల భరతునికాపైన
రామచరిత వినరె రక్తితోడ

తే॥ మ్రొక్కి, రాముండు, సౌమిత్రి ముదిత సీత
15 గలిసి వనికేగె, జనులెల్ల కంటనీరు
కార వెంటాడి విధిలేక మరలినారు
రామచరితను వినిపింతు రమ్యముగను

ఆ॥ గంగ దాట నెంచ గడసరి గుహుడనెన్
16 రాతినాతిచేసె రామపదము,
కడగనిమ్ము పదము, పడవ స్త్రీయగునేమొ
రామచరిత వినరె రక్తితోడ

తే॥ సీత మధ్యలో చనుచుండ చింత లేక,
17 వెనుక సౌమిత్రి నీడలా వెంటరాగ
చిత్రకూటాన నెలకొని చేసె నెలవు
రామచరితను వినిపింతు రక్తితోడ

ఆ॥ 'రామ' అనుచు వగచి రాజేగె దివికిని,
18 భరతు పిలువ నంప, వచ్చి మ్రొక్కి,
తల్లినడిగె నపుడె తన రాముడేడని
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ కైక యపుడు చెప్పె గడచిన కథయంత,
19 రాజ్యమేలుమనెను రాజువోలె,
తల్లిదిట్టి యతడు తన రాముకైనేడ్చె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ తండ్రి దహనకాండ తాజేసి భరతుడు
20 రాము వెదక నేగె రథమునెక్కి
జనుల మూకజేరి చనెవానితోడనే
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ తరలి వచ్చుచున్న భరతుని చూచిన
21 లక్ష్మణుండు తలచె రాముపైకి
భరతుడెత్తివచ్చె ప్రాణాలు తీయనై
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ రాముడతని నాపి రమ్మన భరతునిన్
22 సజల నేత్రుడైన సహచరుండు
తండ్రి మరణవార్త తనభ్రాతకున్ చెప్పె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ఊరడిల్లి, పిదప ధరనేల రమ్మనెన్
23 మాటతప్పననెను మహిజ పతియు
పాదుకలతొ రాజ్యపాలన కొప్పించె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ పదియు నాల్గు ఏళ్ళ పాలన పిమ్మట,
24 అన్నచూడకున్న అగ్నిదూకు
మాటపైన తిరిగె మాన్యుడా భరతుండు
రామచరిత వినరె రక్తితోడ



తే॥ వనిలొజంపి, విరాధుండు అనుదనుజుని
25 మునుల వెతలన్ని దీర్చెను ముదము కలుగ
మునుల దీవెనలందెను ముదితతోడ
రామచరితను వినిపించు రక్తితోడ

తే॥ రాముడుండెను సీతతో, లక్ష్మణుండు
26 పంచవటియందు నిర్మింప పర్ణశాల
మునులకిచ్చిన బాసతో మనసు నిండ
రామచరితను వినిపింతు రక్తితోడ

తే॥ కామదహిత శూర్పణఖతో కానిరీతి
27 ఆటలాడ, సీతను మ్రింగ నామె తలచె
ముక్కు చెవులకోసెను భ్రాత, రక్కనేడ్వ
రామచరితను వినిపింతు రక్తితోడ

తే॥ ఆమెనోదార్చ ఖరదూషణాది దనుజ
28 లొచ్చి రాముపై దండెత్తి చచ్చిరంత
లంకజేరి తానుసిగొల్పె రావణునికి
రామచరితను వినిపింతు రక్తితోడ

ఆ॥ రావణుండు బిలిచి లంకకు మారీచు
29 సీత హరణమందు జేయతనకు
గోరె సాయమతడు, సరియనె విధిలేక
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ శిక్షపొందె తుదకు సీతమ్మ ఆనాడు
30 రావణునికి చిక్కి రమణి ఏడ్వ
బల్మి నపహరించె వసుధసుతను నాడు
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ ఏమిపూజ జేసె నిలనాజటాయువు
31 అమ్మకావబోయి అసువులొదల
పక్షికూడ ఘనత బడయును ప్రభుగొల్వ
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ శబరి చేతి పండ్లు చవులూరదినె స్వామి
32 ఎంగిలైన లేక ఏమి వింత
భక్త కోటి కొఱకె బడెనన్ని యిక్కట్లు
రామచరిత వినరె రక్తితోడ

తే॥ వాలి సుగ్రీవులనియెడి వానరులలొ
33 అగ్రజుడు వాలి వానరయధిపుడతడు
తప్పుగానెంచి చంపెద దమ్మునెను
రామచరితను వినిపింతు రమ్యముగను



ఆ॥ ఋష్యమూకమందు నుండె సుగ్రీవుండు
34 వాలి భీతిచేత గలియ హితులు
రామలక్ష్మణులను రాజూచి వెరపందె
రామచరిత వినరె రక్తితోడ

తే॥ అణచ సుగ్రీవ భయమును హనుమ అపుడు
35 బాపనిగ మారి ప్రభు జేరి ప్రశ్నలేయ
'హనుమ' అనిపిల్చి నాటితో వానిగొన్న
రామచరితను వినిపింతు రమ్యముగను

ఆ॥ మైత్రిజేసి కొనిరి ఆ రాఘవుడు, కపి
36 భార్యలపహరింపబడిన వారు
గాలితోడుపడెను ఘనమైన యగ్నికి
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ ఏడుతాటిచెట్లు పడగొట్టి ఒకటిగా
37 దుంధుభి శవమున్న దూరమందు
బడగ బొటనవ్రేల బరమాత్మ దన్నెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ వాలితోటి పోరు సలుప సుగ్రీవుండు,
38 చెట్టుచాటునుండి కొట్టి వాలి
వూని కావ సఖుని పొందెను యపకీర్తి
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ వాని తనయునపుడె ఘనముగ యువరాజు
39 చేసి మాటనిలువ జేసినాడు
వానలాగుదాక బాధను సహియించు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ కపులు ఎలుగులవని గాలించి వెదకిరి
40 హనుమ ఒకడె సీతనరయునంచు
తెలిసి ఏమొ యిచ్చె దివ్యాంగుళీయకం
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ స్వర్ణలంకలోన జానకి కలదని
41 తెలిసె, చేరువిధము దెలియకుండె
పవనసుతుకు జాంబవంతుడు బోధించె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ సుందరమగు కాండ శోభతో మొదలయ్యె
42 సాగరమును దాట నెగిరి హనుమ
వినయపూర్వకముగ మైనాకు కాదనెన్
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ సురస గెల్చె దెలివి సుందర హనుమయ్య
43 లంకజొచ్చె నతడు రాత్రివేళ
లంకిణనెడి ఘోర రాక్షసిన్ మర్ధించె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అచటి స్త్రీలయందు అవనిజ లేకుండె
44 చూచె కడకు ఆ యశోక వనిని,
బెదర గొట్టు అసురునాదరి తిలకించె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ భయమునొంద సీత, పాపి మూడునెలల
45 గడువునిచ్చి చనియె కఠినుడౌచు
తలచి రామునపుడు కలకంఠి రోదించె
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ హనుమ రామనామ గానమ్ము జేసెను
46 సీత భీతి బాప చేతికిచ్చె
రామునుంగరమ్ము రమణి శాంతించంగ
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రాముివివరములను రమ్యంబుగా చెప్పె
47 సంతసించ, సీత అంత పతికి
మూడు నెలల దాక గడువిచ్చె గొనిపోవ
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ సుదతి హనుమకిచ్చె చూడామణిని తీసి
48 గుర్తువోలె ప్రభుకు, కోరె హనుమ
పండ్లు తినెదనమ్మ బాపగ క్షుద్బాధ
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ ఫలములతడు తినుచు పడగొట్టె చెట్లను
49 అడ్డుచెప్పు భటుల నణచి జంపె
కొందరసురు కడను గోడును బెట్టిరి
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అక్షుడనెడివాడు అసురపతి సుతుండు
50 సేనకతడు నేత చనెను అనికి
ముష్టిఖాతమీయ ముగిసె నాతని కథ
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ వచ్చి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమే వేయ
51 కట్టు బడెను హనుమ గౌరవమున
తెచ్చిరపుడు సభకు దైత్యులు గర్వాన
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ హనుమ పట్టుబడగ ఆ రావణుడు చూచి
52 హింసచేయనేల యిటుల అనెను
'కపిని కనుక' యంచు ఘనుదుత్తరంబిచ్చె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ఆకలికిని కపిని ఆగలేకుంటిని
53 పండ్లు తినగ భటులు బాదినారు
నేను తిరిగి బాద నీల్గిరి హనుమనెన్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ జరిగినది యదేమొ జరిగెను, యికనైన
54 సీతనొప్పగించి హితముకోరి
శరణువేడుమనెను శ్రీరామపదమంటి
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ చంపుడనుచు ఆజ్ఞ జరిపిన దనుజుని
55 వేడి, వాని భ్రాత నుడివె మ్రొక్క
దూత జంప కాదు నీతి ఓ లంకేశ!
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రావణుండు వినుచు లంక వీధులలోన
56 వీనితోక కగ్గిపెట్టి ద్రిప్ప
చక్కనైన శిక్ష సరసమ్ముగా యనెన్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ తోకకగ్గిపెట్ట తులువలు రాక్షసుల్
57 లంకనంత కాల్చె రామబంటు
"సతిని చూచిరమ్ము సఖ యన కాల్చొచ్చె"
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ జలధి దాటి చేరె సఖులను మారుతి,
58 సంతసించి కపులు చనిరి తుదకు
మధువనంబునందు సుధ త్రాగి రేగిరి
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ వనము ధ్వంస బరచ వానరమూకలు
59 కావలున్న వారు కత్తిదూయ
చితకబాది వారి చిందేసిరి కపులు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ మొదట రాజు చూచి ముదమందె నూహించి
60 సీత జూడకున్న చేయరిట్లు
వానియూహ నిజము అని జెప్పె హనుమన్న
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ రామ దర్శనంబు రాజుతో చేసిరి
61 హనుమ ప్రభుని చేర హర్షమంది
విశదపరచె ప్రభుకు వివరమ్ములన్నియున్
రామచరిత వినరె రక్తితోడ

తే॥ సీత చూడామణిని యిచ్చి చెప్పువిధము
62 హనుమ లంకను కాల్చిన ఆ వివరము
వినుచు దుఃఖించె, పులకించె విభుడు తాను
రామచరితను వినిపింతు రమ్యముగను

తే॥ రావణుని పైకి దండెత్తి లలన గొనుట
63 నిశ్చయించెను రాముండు నిండు సభలొ
లంక శుభశకునాల్గాంచె రమణి సీత
రామచరితను వినిపింతు రమ్యముగను

ఆ॥ అన్నకపుడు చెప్పెనా విభీషణుడును
64 అన్న! రాముడన్న హరియె సుమ్మి
దానవులను జంప ధరజేరె వినుమయ్య
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ సీతనొప్పగించు శీఘ్రమ్ముగా నీవు
65 రాముశరణు వేడు రక్షనీయు
వానివైరి వైన వధ నీకు దప్పదు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అన్న తోటి విసిగి ఆ విభీషణుడట్లు
66 జలధి దాటి పోయె శరణుకోరి
వాని పట్టి కపులు ప్రభుకడ దెచ్చిరి
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ మంతనాలు జేసెనంత నా రాముండు
67 కపులతోటి తుదకు గౌరవముగ
వానినాదరింప వలెనని తలచెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ శరణు కోరువారి జతనుండు దైవమే
68 రాముడంచు తెలిసి తమరి కథను
ఆ విభీషణుండు అప్పుడు తెల్పెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ జలధి జలమునపుడు స్వయముగా తెప్పించి
69 రాజ్యతిలకు జేసె రాముడతని
జయ జయంబు బల్కి సంబరపడ కపుల్
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ సాగరమును జేరి చక్కగా పూజించ
70 దయను జూపడయ్యె దరికి జేరి
శరమునెక్కు బెట్ట సాగరుడేతెంచె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రాము కడకు వచ్చి రక్షణ కోరెను
71 జలధి దాటు విధము సాగరుండు
రాముతోడ జెప్పె రమ్యంబుగా కథన్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ నీలుడనెడి కపికి నీటిలో యేదైన
72 వేసినంత దేలు విధిగ యనెడి
వరము కలదు, దాన వారధి గట్టును
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ చెప్పి వెడలిపోయె అప్పుడు సాగరు,
73 డట్లు చేయదలచె ఆ రఘుపతి
సేతు బంధనమ్ము సేన జలధిదాట
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రామదండు దాటి లంకను చేరెను
74 అంగదుండు దూత అయ్యె చనియె,
రావణుండు వినడు లంకకు చేటగున్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ఒక్కరొక్కరసురయోధులు, చచ్చిరి
75 అప్పుడొచ్చె తానె అసుర సుతుడు
ఇంద్రజిత్తు యనికి, ఎదురయ్యె సౌమిత్రి
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ మాయయుద్ధమందు ఆయన మొనగాడు,
76 లక్ష్మణునితా పోరి లాఘవముగ
మూర్ఛనొంద చేసె, మూగిరి కపులెల్ల
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రాము కంటినీరు రవ్వంత ఆగదు
77 సోదరునికి ఏడ్చి సొమ్మసిల్లె,
వలయునంచు చెప్పె వైద్యుడు సంజీవి
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ తెల్లవారు లోపు తేవలె సంజీవి,
78 అటుల చేయువాడు హనుమ ఒకడె
పయనమయ్యె యంత పావని దానికై
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ గుర్తుపట్టలేక గురుతర సంజీవి
79 కొండనెత్తి తనతొ గొంచుపోయె,
లక్ష్మణుండు లేచె రఘుపతి ముదమందె
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ హర్షమంది కపులు హనుమను పొగిడిరి,
80 లక్ష్మణుండు పొందె రామునాజ్ఞ,
ఇంద్రజిత్తుతోడ ఎదిరించి తలపడెన్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ తీవ్రమైన పోరు తిలకించిరెల్లరున్
81 రాముపైన ఆన లక్ష్మణుండు
పెట్టి, గొప్ప శరము వేయుచు నరి జంపె
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ ఇంద్రజిత్తు మరణమేవిధి రావణున్
82 కలచె జెప్పనలవి కాదు సుమ్మి,
కుంభకర్ణు డొకడె గొప్పదిక్కాయెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ఆరు నెలలు నిద్ర ఆర్నెల్లు మెలకువ
83 వాని సహజ గుణములనగ నుండె,
నెలలు ఆరులోపు నిద్రలేపగ రాదు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ నిద్ర లేపిరేని నీల్గును బలమెల్ల
84 కాన వాని లేప కాదు మేలు
అయినగాని వాని యవసరమ్మొచ్చెను
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ 'డప్పు'లన్ని మ్రోగ దరిచేరి శూలాల
85 పొడిచి గోలచేయ చెడెను నిద్ర
లేవగానె తినెను "ఆవురావురుమంటు"
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ కుండలందు బాగ నిండిన తిండిని
86 కడవలందు నిండు కల్లు నంత
లెక్కలేని పశుల లేవగా తినెవాడు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అన్న గలిసి యడిగె ఆ కుంభకర్ణుండు
87 అట్లు నిద్ర లేపు యవసరంబు
కారణంబు వినుచు సరియనె తమ్ముండు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ కుంభకర్ణుడేగె ఘోరమాదృశ్యంబు
88 కాళ్ళ క్రింద నలిగి కపులు జావ
చేసె నాశనంబు చిటికెలో నసురుండు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అలిగి రాముడేసె నసమాన యస్త్రంబు,
89 కొండలాగ బడెను ఘోరమైన
దనుజుడంతమయ్యె తనువును వీడుచున్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రావణునికి పత్ని రాణి మండోదరి,
90 భర్త కాళ్లబడెను బ్రతిమిలాడె
సీత తిరిగి యిచ్చి శ్రీరామశరణంద
రామ చరిత వినరె రమ్యముగను



ఆ॥ చచ్చిరెల్ల సుతులు, చచ్చిరి హితులెల్ల,
91 చచ్చె సోదరుండు చావుకేల
భయము? కీర్తినయము పగవాని చంపనెన్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రావణుండు అనికి రయమున యేతెంచె,
92 ఘోర యుద్ధమపుడు జరిగె నచట
విరథు చేసి వదిలె వైరిని రాముండు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ "నేడు పోలురమ్ము" గడపుచు విశ్రాంతి
93 రేపు చేవయున్న నపుడు అనుచు
సిగ్గు కలుగునట్లు జెప్పెను రాముండు
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ పోరు ఘోరమయ్యె మరునాడు రావణున్
94 నిలువరించ లేక నీరసించె
అలిసిపోవుచుండె ఆనాడు రఘుపతి
రామచరిత వినరె రక్తితోడ.

ఆ॥ అటకు వచ్చెనపుడు ఆగస్త్యుడాదిత్య
95 హృదయ స్తోత్రబోధ నమర చేసె
ప్రభువు గలుగ బలము పఠియించె ముమ్మార్లు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ వచ్చె పది శిరములు, బాహువులిరువది
96 దాల్చి రావణుండు దాశరథితొ
అనినిచేయ జూచిరందరు దేవతల్
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ తలలు తెగినగాని దానవునకు మొల్చె
97 అట్లె చేతులొచ్చె అచ్చెరముగ
కారణంబు తెలిపె ఆ రావణుని భ్రాత
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ అతని నాభినుండె అమృత భాండంబు
98 దానిగొట్టవాడు గొనును మృతిని,
నాభిగొట్ట ననియె నరశ్రేష్ఠుడంతట
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ పవనుడంత మార్చె బ్రహ్మాస్త్రపథమును
99 చితికి నాభి దనుజపతి నశించె
విష్ణుపురిని జేరె వీడుచు దేహంబు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ఆ విభీషణుండు ఆనాడె రాజయ్యె,
100 సంతసించి మురియ జగతి అంత
సీతముక్తురాలు జేసెను రాముండు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ మంగళమగురీతి మహిపుత్రి స్నానాల
101 నాచరించికట్టె నపుడు నూత్న
వస్త్రములను పిదప ప్రభువును చేరెను
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ రామునెదర తెచ్చి రమణి జానకినుంచ
102 "ఇచ్ఛవచ్చుకడక స్వేచ్ఛ బొమ్మ"
అనగ సీతకోరె నగ్నిని వ్రేల్చగ
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ అగ్నిలోన దూక నామెను కాపాడి
103 ఆమె శీలవతని అగ్ని బల్కి
ఆ పునీత సీతనర్పించె ప్రభువుకున్
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ ముదమునంది రామమూర్తి "ఓ లంకేశ!
104 పుష్పకమ్మునిమ్ము పోవ" అనియె
వెడలిరందరున్ను వడిచేరగనయోధ్య
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ హనుమ ముందు బోయె ఆ వార్త భరతుకున్
105 చెప్పనెగిరి యపుడె జేరివాని
రామునాగమనము రంజిల్ల చెప్పెను
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ కలిసిరందరున్ను కన్నుల పంటయ్యె
106 మురియ తల్లులట్లె మురిసె ప్రజయు
బాగుచూడ రామపట్టాభిషేకంబు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ శుభముహూర్తమందు చూడ చక్కని జంట
107 సీత దాశరధులు జేరిరచట
పావనంబు రామపట్టాభిషేకంబు
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ పనిచె రాముడపుడు బహువిధంబులనున్న
108 బహుమతులను ఎల్ల బ్రాహ్మణులకు,
ప్రజకు సంతసించి వారుబాగనుచుండ
రామచరిత వినరె రక్తితోడ



ఆ॥ అంగదుండు పొందె నట్లె సుగ్రీవుండు,
109 కపులు పొందిరెల్ల ఘనముగాను
రాముడిచ్చు కాన్కలమిత సంతుష్టులై
రామచరిత వినరె రక్తితోడ

ఆ॥ హనుమ పొందెరత్నహారంబు ప్రేమతో
110 సీత చేతినుండి యతని జూచి
జయము జయమనంచు జై కొట్టిరెల్లరున్
రామచరిత వినరె రక్తితోడ

## మంగళం

ఆ॥ మంగళంబులగును మా జానకమ్మకు
మంగళంబు రామ మహిపతికిని
మంగళంబు దీని మానక చదివిన
మంగ పతియొసంగు మంగళంబు